క్లుప్తంగా

డ్రమ్ సీడర్ పద్ధతిపై రైతులకు అవగాహన



మదనాపురం: మండల కేంద్రంలో శుక్రవారం డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి సాగుపై రైతులు, ఏఈఓలకు పాలెం వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రమ్ సీడర్‌తో విత్తుకోవడం వల్ల సాగు ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. అనంతరం కేవీకే శాస్త్రవేత్త రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ డ్రంసీడర్‌తో సాగు చేయడం వల్ల కూలీల ఎద్దడి అధిగమించడంతో పాటు పంట దిగుబడి కూడా ఎక్కువగా వస్తుందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర్‌రెడ్డి, ఏడీఏ దామోదర్‌రెడ్డి, ఏఈఓ మున్నా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పోచ రవీందర్‌రెడ్డికి అభినందనలు



వనపర్తి: సామాజిక కార్యకర్త పోచ రవీందర్‌రెడ్డి జిల్లాలో అత్యధికంగా 81 సార్లు రక్తదానం (ఓ నెగిటివ్) చేయడంతో జిల్లా అధికారుల సిఫారసు మేరకు ఇటీవల గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. తన సేవలను గుర్తించి సముచిత గౌరవాన్ని ఇచ్చినందుకు అధికారులు, గవర్నర్‌కు పోచ రవీందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డిని స్థానికులు అభినందించారు.

మామిడి చెట్లకు నిప్పు



వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన రైతు మేస్త్రీ మల్లేష్‌కు చెందిన మామిడి తోటకు గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో దాదాపు 20 మామిడి చెట్లు పూర్తిగా కాలిపోయాయి. పదేళ్లుగా మామిడి తోటను పెంచి పంట చేతికి వస్తున్న దశలో కావాలనే కొందరు వ్యక్తులు చెట్లకు నిప్పంటించారని బాధితుడు మల్లేష్ వాపోయారు. ఈ ఘటనపై పూర్తి విచారణ జరపాలని ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశారు.

కొనసాగుతున్న బీటీ రోడ్డు పనులు



వీపనగండ్ల: మండల కేంద్రం నుంచి గోవర్ధనగిరి వరకు వేస్తున్న బీటీ రోడ్డు పనులతో పలు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో రోజులుగా బిల్లులు లేక బీటీ రోడ్డు పనులు నిలిచిపోవడంతో గోపల్‌దిన్నె, గోవర్ధనగిరి, రంగవరం, వీపనగండ్ల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవలే కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి చొరవతో తిరిగి నిధులు మంజూరై రెండు వరుసల బీటీ రోడ్డును నిర్మిస్తున్నారు. ఈ పనులను ఎంపీపీ కమలేశ్వర్‌రావు, సర్పంచ్ నర్సింహారెడ్డి శుక్రవారం పరిశీలించారు.

కరపత్రాల విడుదల



వనపర్తి టౌన్: ప్రపంచాన్ని మార్చాలన్న, దేశాన్ని అభివృద్ధి వైపు నడిపేందుకు శక్తివంతమైన ఆయుధం విద్య అని విద్యార్థులు గుర్తించాలని ప్రజా వైద్యశాల డైరెక్టర్ డాక్టర్ మురళీధర్ అన్నారు. ఈ మేరకు నూతన విద్యా సంవత్సరంలోకి అడుగు పెడుతున్న విద్యార్థులకు స్వాగతం పలుకుతూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన స్వగృహంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యపై మక్కువ పెంచుకొని చదివితే జీవితంలో అత్యుత్తమ స్థాయికి ఎదుగుతారని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆది, కుమార్, శరత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

పెద్దకొత్తపల్లి: మండలంలోని గంట్రావుపల్లిలో సంపద వనాల పనులను ఎంపీడీఓ కృష్ణయ్య శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో కూలీలందరికీ పని కల్పించాలని సూచించారు. కొత్తగా అవసరం ఉన్న కూలీలకు జాబ్‌కార్డులను అందజేయాలని ఉపాధి సిబ్బందికి సూచించారు.

ప్రజల సహకారంతోనే అభివృద్ధి

- పుర చైర్‌పర్సన్లు గాయత్రి, మంగమ్మ
- పుర కార్యాలయాల వద్ద జెండా ఆవిష్కరణ
- కార్మికులను సన్మానించిన పాలక వర్గం



అమరచింతలో మున్సిపల్ సిబ్బందిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆత్మకూర్: స్థానిక మున్సిపాలిటీలో ప్రజల సహకారంతో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణ ప్రగతి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాలకమండలి ఏర్పడిన అనంతరం పట్టణ ప్రజల చిరకాల వాంఛ అయిన రోడ్ల విస్తరణ పనులను విజయవంతంగా చేపట్టామన్నారు. అలాగే రూ.కోట్లు వెచ్చించి డివైడర్లు, సీసీ రోడ్లు, డ్రైయినేజీలు, స్ట్రీట్ లైట్లు, పార్కులు, క్రీడా మైదానాలు, హరితహారం, వైకుంఠధామం, మార్కెట్ ఆయా అభివృద్ధి పనులను ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సహకారంతో చేపట్టామని అన్నారు.

ఆకట్టుకున్న సంబరాలు

సంబురాల్లో భాగంగా మున్సిపాలిటీ వాహనాలతో ర్యాలీ, రంగురంగుల ముగ్గుల పోటీలు, కార్మికులకు సన్మానం చేయడంతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. మహిళల బతుకమ్మ సంబరాలు, కోలాటం, చిన్నారుల నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాలకమండలి సభ్యులు వారికి బహుమతులు అందజేసి ప్రశంసించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ శివరంజని, తహసీల్దార్ సింధూజ ఉన్నారు.

అమరచింత: మున్సిపాలిటీల్లో కొనసాగిస్తున్న పట్టణ ప్రగతి కార్యక్రమం ద్వారా పట్టణంలో సుందరీకరణ పనులతో పాటు వార్డుల వారీగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని చైర్‌పర్సన్ మంగమ్మ తెలిపారు. సంబురాల్లో భాగంగా మున్సిపల్ కార్యాలయం వద్ద జాతీయ పతాకం ఎగురవేశారు. అనంతరం మున్సిపల్ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, మహిళా సంఘాల సభ్యులు, ఆర్పీలతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. మున్సిపల్ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, ఆర్పీలను సన్మానించి ప్రశంస పత్రాలను అందించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జీఎస్ గోపి, కమిషనర్ మహమ్మద్ ఖాజా, మార్కెట్ చైర్మన్ ఎస్ఏ రాజు, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ నాగభూషణం గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, కౌన్సిలర్లు విజయరాములు, రాజ్‌కుమార్, మాధవి, కోఆప్షన్ సభ్యులు షాహిన్, షానవాజ్, అడ్వకేట్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు: స్థానిక పురపాలక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయం నుంచి సుభాష్ చౌరస్తా వరకు ఘనంగా పట్టణ ప్రగతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ కరుణశ్రీ మాట్లాడుతూ పట్టణ ప్రగతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్న వారికి ప్రశంసా పత్రాలు అందించామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కర్రెస్వామి, కమిషనర్ ఆదిశేషు, కౌన్సిలర్లు పార్వతిగౌడ్, సువర్ణ, గోపిబాబు, రామకృష్ణ, ఎల్లారెడ్డి, అశ్విని, పద్మ, సుమతి, ఏఈ రమేష్‌నాయుడు, మేనేజర్ గణేష్‌బాబు, నాయకులు సాయినాథ్, ఎల్లయ్య, వేణుయాదవ్, సత్యనారాయణ, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్ ర్యాలీలో ప్రజాప్రతినిధులు



పెబ్బేరులో..

జిల్లా ఉత్తమ పారిశుద్ధ్య కార్మికుడిగా రాములు



డిప్యూటీ కమిషనర్ రవీందర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న రాములు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న రాములు జిల్లా ఉత్తమ పారిశుద్ధ్య కార్మికుడిగా ఎంపికయ్యాడు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పల్లె ప్రగతి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి జిల్లా నుంచి ఒకరు ఉత్తమ పారిశుద్ధ్య కార్మికుడిని ఎంపిక చేసి సన్మానించారు. వనపర్తి జిల్లా నుంచి ఖిల్లాఘనపురంలో పనిచేస్తున్న రాములును ఎంపిక చేశారు. అతడిని గురువారం రాత్రి రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో పంచాయతీరాజ్, రూరల్‌డెవలప్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ రవీందర్ శాలువాతో సన్మానించి మెమోంటో, ప్రశంసా పత్రం, యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా రాములును మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



బాధితులకు నగదు అందిస్తున్న అధికారులు

వనపర్తి టౌన్: విద్యుత్ సర్కిల్ పరిధిలోని వీపనగండ్ల సెక్షన్‌లో స్పాట్ బిల్లర్‌గా పనిచేస్తూ ఇటీవల మరణించిన అనంత మహేష్‌గౌడ్ (25) కుటుంబానికి ట్రాన్స్‌కో అధికారులు రూ.5లక్షల ఆర్థికసాయం అందించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఎస్‌ఈ కార్యాలయంలో శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు ఎస్‌ఈ నాగేంద్రకుమార్, డీఈ నరేందర్ కుమార్ చేతుల మీదగా నగదును అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ నాగేంద్రకుమార్ మాట్లాడుతూ.. మహేష్ కొల్లాపూర్‌లో దశాబ్ది ఉత్సవాలకు హాజరయ్యేందుకు వెళ్తుంటే చిన్నంబావి మండల కేంద్రం సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని తెలిపారు. తోటి ఉద్యోగులు దాతృత్వంతో బాధిత కుటుంబానికి అండగా ఉండేందుకు అధికారులు రూ. 347,618, వీపనగండ్ల సెక్షన్ స్టాఫ్ 1,16,000, స్పాట్ బిల్లర్లు రూ. 41వేలు ఆర్థికసాయం అందించారు.

స్థలాలు చూపించాలి

వనపర్తి: జిల్లా కేంద్రంలో పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలిచ్చి ఏళ్లు కావస్తున్నా.. స్థలాలు చూపించలేదని, అధికారులు వెంటనే స్పందించి స్థలాలు చూపించాలని ప్రజా సంఘాల పోరాట వేదిక జిల్లా కన్వీనర్ పుట్ట ఆంజనేయులు కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పీర్లగుట్టతో పాటు ఆయా గ్రామాల్లో పర్యటించి ఇళ్లు లేని నిరుపేదలతో మాట్లాడారు. ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను గుర్తించి పేదలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాయిలీల, ఉషేనమ్మ, పద్మ, నరేష్, మాసమ్మ, భాస్కర్, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

పెంట్లవెల్లి: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తప్పకుండా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహా యాదవ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో తప్పకుండా కేసీఆర్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. తెలంగాణాలోనూ కర్ణాటక ఫలితమే పునరావృతం అవుతుందన్నారు.

నదీ తీర ప్రాంతాలను రక్షించేందుకే 'వనమాల'



అమరచింత: మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు సమీపంలోని ప్రాజెక్టు భూమిలో వనమాల కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటేందుకు గుంతలు తవ్వుతున్నట్లు ఏపీఓ బాలయ్య తెలిపారు. మండలంలోని నందిమళ్ల, కిష్టంపల్లి, ఈర్లదిన్నె గ్రామాల్లో నదీ తీరం వెంట మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పరిధిలోని అమరచింత, ఆత్మకూర్, పెబ్బేర్, చిన్నంబావి మండలాల్లో వనమాల ద్వారా మొక్కలను నాటి నదీతీర ప్రాంతాలు కోతలకు గురికాకుండా పచ్చదనం నింపేలా చూడడమే ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ రఘు తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు మేఘారెడ్డి చేయూత

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని బండరావిపాకుల గ్రామం ఏదుల రిజర్వాయర్‌లో మునకకు గురైన విషయం తెలిసిందే. ముంపు బాధితుల పునరావాస కేంద్రాన్ని శానాయిపల్లి సమీపంలో ఏర్పాటు చేశారు. అక్కడ ప్రస్తుతం సుమారు వందపైగా ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. తాగేందుకు, వాడుకునేందుకు నీరు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయాన్ని ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా ఫలితం లేకపోవడంతో ఇటీవల కాంగ్రెస్ పార్టీ నాయకులు విషయాన్ని మేఘారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన సొంత డబ్బులతో గురువారం కొత్తబండరావిపాకులలో బోరు వేయించారు. రెండు ఇంచుల నీరు పడటంతో గ్రామస్తుల ఆనందం వ్యక్తం చేశారు. అడిగిన వెంటనే బోరు వేయించిన మేఘారెడ్డిని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోపణలు చేయడం సరికాదు

అమరచింత: స్త్రీ నిధి డబ్బులు కాజేశారంటూ తనపై మెప్మా కోఆర్డినేటర్ యువరాజ్, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని శ్రీచైతన్య ఏరియా లెవెల్ ఫెడరేషన్ సంఘం ఆర్పీ రఘు అన్నారు. తన పరిధిలోని సంఘాల సభ్యుల పొదుపు డబ్బులతో పాటు స్త్రీనిధి డబ్బులు రూ.4.2లక్షలు వరకు బ్యాంకులో జమ చేయకుండా సొంతానికి వాడుకున్నానని అనడంలో నిజం లేదన్నారు. సిరిమల్లె సంఘంలో తన తల్లి సువార్తమ్మ బ్యాంకులో రుణం తీసుకున్నారని తెలిపారు. తన ఆర్థిక ఇబ్బందుల కారణంగా 17 నెలలుగా దానికి సంబంధించిన వాయిదాలను బ్యాంకుకు చెల్లించలేదని కమిషనర్‌కు విన్నవించానని పేర్కొన్నారు. తనపై లేని పోని ఆరోపణలు చేస్తూ డబ్బులను కాజేశాడని ప్రకటించడం, వేతనం నిలిపేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మెప్మా కోఆర్డినేటర్ యువరాజ్ సంఘాల సభ్యులకు రుణాలు కావాలంటే డబ్బులు తీసుకొని సంతకాలు చేస్తున్నారని, వీటిని ప్రశ్నించినందుకు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి నిందితుడి తేలితే చట్టపరంగా శిక్షించాలని కోరారు. తనపై వచ్చిన ఆరోపణలను బహిరంగంగా విచారించకుండా ఆరోపణలు చేస్తున్నారని వాపోయారు.

పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం



ఆత్మకూర్‌లో చిన్నారులకు పాఠ్య పుస్తకాలు అందిస్తున్న ఉపాధ్యాయులు



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యాధికారి లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ పసిపిల్లల్లో విద్యపై ఆసక్తి కలిగే విధంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

ఉమ్మడి వీపనగండ్ల మండలంలోని వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ విద్యా సంవత్సరానికి గాను వంద శాతం పాఠ్యపుస్తకాలను ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేశామని ఎంఈఓ లక్ష్మణ్ నాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలేశ్వర్‌రావు, చిన్నంబావి జెడ్పీటీసీ వెంకట్రామమ్మ, ఎంపీడీఓ కతలప్ప, సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు మంజుల, నాగేశ్వరమ్మ, ఉపాధ్యాయులు స్వప్న, శేఖర్, రాజు, సీఆర్పీ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందిస్తున్నామని, పిల్లలను పనులకు కాకుండా బడులకు పంపాలని ఎంఈఓ భాస్కర్‌సింగ్, సీఆర్పీ సౌమ్యరాణి కోరారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ ఆదేశాల మేరకు మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఇప్పటి వరకు విద్యార్థులకు 10వేలకు పైగా పాఠ్య పుస్తకాలు అందించామని తెలిపారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



చిన్నారుల బరువును పరిశీలిస్తున్న అధికారులు

పాన్‌గల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని పకడ్బందీగా అందించాలని మండల ప్రత్యేకాధికారి సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని అన్నారం, అన్నారంతండాలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన సందర్శించి చిన్నారుల వివరాలు, వారి బరువును ఆయన పరిశీలించారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించకపోతే వారి ఎదుగుదల సక్రమంగా ఉండదన్నారు. కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని ప్రతి చిన్నారికి అందేలా చూడాలని సూచించారు. అవకతవకలకు పాల్పడితే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్త నిర్మల, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం



అధికారికి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: ఉపా చట్టాన్ని రద్దు చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా నాయకుడు హనుమంతు, వనపర్తి డివిజన్ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని మర్రికుంట ప్రధాన రోడ్డు నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కార్యాలయ అధికారికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దశాబ్ది సంబురాల్లో ప్రభుత్వం పేదలకు చేసింది గోరంత, చెప్పుకునేది కొండంతలా ఉందని ఎద్దేవా చేశారు. రైతులకు రుణమాఫీ మొత్తంగా చేయాలని కోరారు. దళితులకు 3ఎకరాల భూమి, నిరుద్యోగులకు నిరుద్యోగ భృత్తి ఇవ్వాలన్నారు. సొంత జాగాలో ఇంటి నిర్మాణానికి రూ.10లక్షల సాయం అందించాలని కోరారు. అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డు ఇవ్వాలన్నారు. పేదలకు ఇచ్చిన హామీలను కేసీఆర్ ప్రభుత్వం చాలా వరకు విస్మరించిందని విమర్శించారు.

కేంద్ర పథకాలను ప్రచారం చేయాలి

పాన్‌గల్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను గడప, గడపకు వివరిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ నియోజకవర్గ నాయకులు అన్వేష్, బీజేవైఎం జిల్లా నాయకులు రమేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తపేట, మల్లాయిపల్లి గ్రామాల్లో పర్యటించి బూత్ స్థాయి కమిటీలతో చర్చించారు. పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులను చేపడుతున్నారన్నారు. సోమశిల, సిద్ధేశ్వరం బ్రిడ్జి మంజూరు, పరిశ్రమల ఏర్పాటుకు ఆయన కృషి చేశారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరిస్తూ ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. కార్యక్రమంలో జగన్‌గుప్తా, రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

గిరిజన ఉత్సవాలను జయప్రదం చేయండి



మొక్కలకు నీరు పట్టిస్తున్న ఎంపీడీఓ విజయ్‌కుమార్



అన్నారంతండాలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారులు

పాన్‌గల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించే గిరిజన ఉత్సవాలను ఆయా తండాల్లో జయప్రదం చేయాలని మండల ప్రత్యేకాధికారి సురేష్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని అన్నారంతండాను ఆయన సందర్శించి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా ఆయా తండాల్లో నూతన పంచాయతీ భవన నిర్మాణం పనులను ప్రారంభించాలని, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలపై కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ రంగానాయక్ పాల్గొన్నారు.

ఘనంగా నిర్వహిద్దాం

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలల్లో భాగంగా గిరిజన తండాల్లో శనివారం నిర్వహించే గిరిజన ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు గిరిజన మహిళలు, యువత తోడ్పాటునందించాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో సర్పంచ్ శాంతమ్మతో కలిసి ఉత్సవాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలపై ఆట, పాటలు నిర్వహించాలని, దీంతో గిరిజన మహిళలు తమ సంప్రదాయ దుస్తులు ధరించి పాల్గొనాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఖిల్లాఘనపురం: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించే గిరిజన ఉత్సవాలు, ఈ నెల 19న నిర్వహించే హరితోత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ విజయ్‌కుమార్ కోరారు. శుక్రవారం పలు గ్రామాల్లో నర్సరీలు పరిశీలించి మొక్కలకు నీళ్లు పట్టారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా ఇప్పటివరకు నిర్వహించిన కార్యక్రమాలు, త్వరలో నిర్వహించాల్సి వాటి గురించి, నర్సరీలు, అవెన్యూ ప్లాంటేషన్, సోషల్ ఆడిట్ రిపోర్టుపై సిబ్బందితో చర్చించారు. అనంతరం సోళీపురం పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్‌ను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజు, ఏపీఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఏర్పాటు తర్వాతే పట్టణాల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తకోట: ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయ్యాకే పట్టణాలు మరింత అభివృద్ధి చెందాయని దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని క్యూఆర్ ఫంక్షన్ హాల్‌లో పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. నిరుపేదలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉందన్నారు. తొమ్మిదేళ్ల కాలంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి పనులకు ప్రజలు ఆకర్షితులై మరోసారి భారీ మెజార్టీతో బీఆర్‌ఎస్‌ను అధికారంలోకి తీసుకొస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాల అమలు చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని 12 వేల పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేసినట్లు చెప్పారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, చైర్‌పర్సన్ సుకేషిని, కమిషనర్ శ్రీనువాసులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు విశ్వేశ్వర్, సీడీసీ చైర్మన్ చెన్నకేశరెడ్డి, కొండారెడ్డి, కౌన్సిలర్లు సంధ్య, పద్మ, ఖాజమైనోదీదన్, రామ్మోహన్‌రెడ్డి, రాముల యాదవ్, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి



మాట్లాడుతున్న ఏఓ కుర్మయ్య

కొత్తకోట రూరల్: రైతులు వానాకాలం పంటలను వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సాగు వేయాలని పెద్దమందడి మండల వ్యవసాయ అధికారి కుర్మయ్య అన్నారు. వానాకాలం పంటల సన్నద్ధంపై శుక్రవారం బలిజపల్లి రైతువేదికలో రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ ఏడాది వరి పంట సాధారణం కంటే ఒక నెల ముందుగానే సాగు చేయాలన్నారు. దీని వల్ల యాసంగి సాగు చేసిన పంటల కోతల సమయంలో కురిసే అకాల వర్షాల వల్ల పంటనష్టం వాటిల్లకుండా చేసుకోవచ్చన్నారు. పొలంలో పచ్చిరొట్ట, జనుము, జీలుగ సాగు చేసి కలియదున్నడం వల్ల భూసారం పెంపొందించుకోవచ్చని రైతులకు తెలియజేశారు. డ్రమ్ సీడర్ ద్వారా లేదా వెదజల్లే పద్ధతుల ద్వారా వరిసాగు చేయడం వల్ల ఎకరానికి రూ.5వేల నుంచి 8వేల వరకు ఖర్చు ఆదా అవుతుందని, కూలీల కొరత అధిగమించవచ్చన్నారు. పొలాల్లో గడ్డిని కాల్చడం ద్వారా భూసారం తగ్గి పంట దిగుబడిపై దాని ప్రభావం పడుతుందన్నారు. కరిగెటలో ముగర బెట్టడం ద్వారా పంటకు కావల్సిన పోషకాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జయంతి, ఏఈఓ రజని పాల్గొన్నారు.